సాక్షి జగిత్యాల

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



కలెక్టర్‌ను కలిసిన జైలర్

జగిత్యాలజోన్: కలెక్టర్ యాస్మిన్ భాషాను గురువారం స్పెషల్ సబ్‌జైలు జైలర్ ఎస్.మొగిలేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



శివస్వాముల శోభాయాత్ర

వేములవాడ: మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ పురవీధుల్లో శివస్వాములు గురువారం శోభాయాత్ర నిర్వహించారు. ఓం నమఃశివాయ ధ్వనులతో వీధులు మార్మోగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

34.0/16.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత కొనసాగుతుంది. రాత్రి సమయంలో చలి కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ



మల్యాల స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

మల్యాల/పెగడపల్లి: మల్యాల సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఎ.భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా మల్యాలలో ఏ తరహా కేసులు నమోదు అవుతున్నాయి...? రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు. ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారంటూ ఆరా తీశారు. కొండగట్టులో సీసీ కెమెరాల, శాంతి భద్రతల నిర్వహణ అంశాలపై సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెగడపల్లి స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఎస్పీ భాస్కర్ వెంట డీఎస్పీ ఆర్.ప్రకాశ్ ఉన్నారు. కార్యక్రమంలో సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ భారతి

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ భారతి నారాయణ్ భట్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ భారతి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయకళాశాలలో ప్లాంట్ పాథాలజీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి పొలాస వ్యవసాయ కళాశాలకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ అసోసియేట్ డీన్‌గా పనిచేసిన డాక్టర్ నరేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ భారతికి కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలుంటే 1098కు ఫోన్ చేయాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న వైద్య బృందం

జగిత్యాల: విద్యార్థినులకు ఎలాంటి సమస్యలున్నా 1098 టోల్‌ఫ్రీకి సమాచారం అందించాలని జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయని విదార్థులను అడిగి తెలుసుకున్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు శివకుమార్, విజయలక్ష్మి, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు. పాఠశాలలో 217 మందికి గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుతం బాగానే ఉన్నారని, అస్వస్థతకు గురైన వారు కోలుకుంటున్నారని, మరో రెండు రోజులు వైద్య శిబిరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు.

వామ్మో.. ఎంసీహెచ్!



ఇటీవల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షేక్ యాస్మిన్ భాషా ఈనెల 9న ధరూర్ క్యాంపులో ఉన్న మాతాశిశు ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న వైద్యసేవలను గురించి ఆరా తీశారు. సిజేరియన్లు కాకుండా సాధారణ ప్రసవాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. అయినా.. ఎంసీహెచ్‌లోని వైద్యులు తీరుమార్చుకోవడం లేదు. నిర్లక్ష్యమో.. మరేమైనా కారణమో తెలీదు కానీ.. రోజురోజుకు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న బాలింతల సంఖ్య పెరుగుతోంది.

- ఆపరేషన్ అయిన బాలింతలను భయపెడుతున్న ఇన్‌ఫెక్షన్లు
- ఎంసీహెచ్‌కు వచ్చేందుకు జంకుతున్న గర్భిణులు
- కలెక్టర్ చొరవ చూపాలని కోరుతున్న పేదలు

జగిత్యాల: జిల్లాకేంద్రంలో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసవం చేసుకునేందుకు గర్భిణులు జంకుతున్నారు. వైద్యుల నిర్లక్ష్యమో... సిజేరియన్లకు సంబంధించిన కారణమో తెలియదు కానీ మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో ఇన్‌ఫెక్షన్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. గతంలో ఈ కేంద్రంలో ఐదుగురు బాలింతలు మృతిచెందిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. నిత్యం ఏదోఒక ఘటన ఎంసీహెచ్‌లో జరుగుతుండడంతో ఆస్పత్రికి రావడానికి గర్భిణులు వెనుకంజ వేస్తున్నారు. ఎంసీహెచ్‌లో ప్రసవాల సంఖ్య తగ్గుతుండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో గర్భిణుల ఓపీల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

- జగిత్యాల పట్టణానికి చెందిన మహాలక్ష్మి అనే గర్భిణీ జిల్లాకేంద్రంలోని మాతాశిశు కేంద్రంలో ఈనెల 3న మగబిడ్డకు జన్మనిచ్చింది. వైద్యులు సిజేరియన్ చేశారు. అనంతరం కుట్లు వేశారు. వారం రోజుల తర్వాత కుట్లు విప్పగా... ఇన్‌ఫెక్షన్ సోకింది. మహాలక్ష్మికి మళ్లీ కుట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సదరు బాలింత తీవ్ర అస్వస్థతకు గురైంది.
- మాతాశిశు ఆరోగ్యకేంద్రంలో నెలకు 400కు పైగా ప్రసవాలు జరిగేవి. ఇప్పుడు 200 దాటడం లేదు. వైద్యుల నిర్లక్ష్యమా... అందులో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యమో తెలియదు కానీ ఇన్‌ఫెక్షన్ల భయం పట్టుకుంది. సిజేరియన్ సమయంలో ఎండీ ఫిజిషియన్ సైతం ఉండటం లేదని ఆరోపణలున్నాయి.
- ఎంసీహెచ్‌లో సిజేరియన్ చేసేందుకు ఇంతకు ముందు ఆరుసెట్లు ఉండగా ప్రస్తుతం మరో నాలుగు కొనుగోలు చేశారు. వీటితో రోజుకు 15మందికి సిజేరియన్ చేయవచ్చు.
- సిజేరియన్ సెట్ ద్వారా ఆపరేషన్ చేసిన అనంతరం స్టెరిలైజేషన్ (శుభ్రం) చేసేందుకు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ముఖ్యంగా వీటి ద్వారానే ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. ఆపరేషన్లు ఎక్కువగా చేస్తుండడం, పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ కాకపోవడంతో ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయి.
- ఎంసీహెచ్‌లో ఇటీవల బాలింతలు చనిపోవడం, ఇన్‌ఫెక్షన్లకు గురవుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. ఆపరేషన్ సెట్లు తక్కువగా ఉండటం, ఎక్కువ సంఖ్యలో గర్భిణులు రావడంతో ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇంతకు ముందు వైద్యుల నిర్లక్ష్యంతో ఓ గర్భిణి ఇన్‌ఫెక్షన్ సోకి మృతి చెందిన విషయం తెలిసిందే.
- ఇటీవల కలెక్టర్ యాస్మిన్ భాషా సైతం ఎంసీహెచ్‌ను సందర్శించి సిజేరియన్లు చేయవద్దని, నార్మల్ చేయాలని, మౌలిక వసతులు అన్ని కల్పించాలని ఆదేశించారు.
- 75శాతం గర్భిణులకు సిజేరియన్లు చేశారని రిపోర్టుల్లో తేలడంతో కలెక్టర్ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించడంతో పాటు.. ఇన్‌ఫెక్షన్లు సోకకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం

గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని సంఘటనల వల్ల గర్భిణుల సంఖ్య తగ్గింది. మళ్లీ అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీలు చేసుకుంటే ఇబ్బందులు ఉండవు. మౌలిక వసతులు అన్నీ ఏర్పాటు చేశాం. – రాములు, ఆస్పత్రి సూపరింటెండెంట్

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- అందరూ సమన్వయంతో పనిచేయాలి
- సమీక్షలో సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: మార్చి 3వ తేదీ నుంచి నిర్వహించే ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామివారి బ్రహ్మోత్సవాలను పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై పట్టణంలోని పాత టీటీడీ కల్యాణమండపంలో కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ భాస్కర్‌తో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని ఇందుకోసం వివిధశాఖల అధి కారులతో పాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవాసంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 15రోజుల పాటు జరిగే కార్యక్రమానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు కాబట్టి సరిపడా వసతులు కల్పించాలని ఆదేశించారు. భక్తుల సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు, రైస్‌మిల్లర్లు, బ్రాహ్మణ సంఘం సభ్యులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భక్తులకు సరిపడా ఆర్టీసీ బస్సులు, గోదా వరి తీరంలో తాత్కాలిక మరుగుదొడ్లు, స్త్రీలు బట్టలు మార్చుకోవడానికి గదులు. వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ఆలయ పరిసరాలు, గోదావరితీరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి నిరంతరం పారిశుధ్య పనులు నిర్వహించాలని అన్నారు. స్వామివారి కల్యాణం రోజున సుమారు లక్షమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఇరుకుగా ఉన్న ఆలయంలో కాకుండా కల్యాణం వేరేచోట నిర్వహించేలా ఆలోచన చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ యాస్మిన్‌భాషా మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అధికారులు నింతర సేవలందించాలని అన్నారు. ముఖ్యంగా నీడ, తాగునీటివసతి, పారిశుధ్యం, నిరంతర విద్యుత్, బస్సుసౌకర్యం, గోదావరితీరంలో అప్రమత్తత తప్పక అవసరమని సూచించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఆలయం, గోదావరితీరం, బస్టాండులో సిబ్బందిని మఫ్టీలో ఉంచుతామని ఎస్పీ భాస్కర్ అన్నారు. అంతకు ముందు ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.81లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. 23 మందికి రూ.5.91 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మకరంద్, ఆర్డీవో మాధురి, ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, ఆలయ ఈవో శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్ పాల్గొన్నారు.

బీజేపీది దుర్మార్గపు పాలన

జగిత్యాలటౌన్: సీఎం కేసీఆర్ సంకల్పానికి విఘాతం కల్పించేలా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని మంత్రి ఈశ్వర్ మండిపడ్డారు. ఈ మేరకు గురువారం జగిత్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ బంధువుల రియల్‌ఎస్టేట్ వ్యాపారం కోసమే కొండగట్టు ఆలయ అభివృద్ధి అంటూ బండి సంజయ్ చేసిన అడ్డగోలువ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుడి పేరుచెప్పి రాజకీయాలు చేస్తే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్ ఉన్నారు.

స్థానిక ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలి

- గల్ఫ్ మృతుల కటుంబాలకు అండగా ఉండాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): ఉపాధికోసం గల్ఫ్ వెళ్లిన కార్మికులు అక్కడ మృతిచెందితే వారికి ఆర్థికసాయం, మృతదేహాలు తెప్పించేందుకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బాధ్యత వహించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెంది లంకదాసరి వెంకటేశ్ ఇటీవలే గల్ఫ్‌లో మృతిచెందగా... బాధితకుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ వేములవాడలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఇంటి ఎదుట గంభీర్‌పూర్ వాసి వెంకటేశ్ శవపేటికతో ఆర్థికసాయం కోసం నిరసన తెలిపితే గల్ఫ్ జేఏసీ నాయకులపై కేసులు పెట్టించడం దారుణమన్నారు. బాధితకుటుంబాలకు సాయం చేయడం ఎమ్మెల్యేగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. గల్ఫ్ కార్మికులు వివిధ రూపంలో ఇచ్చిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో రూ.18వేల కోట్లు ఉన్నాయని, ఈ విషయాన్ని అసెంబ్లీలో తానుప్రస్తావిస్తే అధికార పార్టీ ఎమ్మెల్సీలు కించపరిచేలా మాట్లాడారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఇప్పటివరకు 2వేల శవపేటికలు గల్ఫ్ దేశాలనుంచి వచ్చాయన్నారు. గల్ఫ్‌లో కార్మికులు మృతిచెందితే వారి కుటుంబానికి రూ.5లక్షలు ప్రభుత్వం సాయం అందించాలన్నారు. గల్ఫ్‌లో ఉన్న వారికి రైతుబీమా వర్తింపచేయాలని, గల్ఫ్‌లో ఉన్నవారికి గ్రామాల్లో వ్యవసాయ భూములు ఉండి పట్టాపాసుబుక్కులు ఉన్నప్పటికి రైతుబీమా విషయంలో నిర్లక్ష్యం చేయడాన్ని ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు కాయితి నాగరాజు, ఎం.డీ అజీమ్, తొట్ల అంజయ్య, పులి హరిప్రసాద్, జవ్వాజి చౌదరి, పబ్బ శ్రీనివాస్, లక్ష్మిరాజం, కృష్ణచారీ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1నుంచి పేదలకు సొంతిళ్లు



కథలాపూర్(వేములవాడ): ఇళ్లులేని పేదలకు సొంతిళ్ల మంజూరు ప్రక్రియ ఏప్రిల్ 1నుంచి అమలు చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. గురువారం రాత్రి కథలాపూర్ మండలం పోసానిపేటలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి భూమిపూజ చేశారు. మండలంలోని 51మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అంబారిపేటలో రూ.1.30 కోట్లతో నిర్మించే ఆరోగ్యకేంద్రం భవనం పనులకు భూమిపూజ చేశారు. పోతారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనం పనులకు భూమిపూజ చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ దాసరి గంగాధర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళా సంఘ సభ్యులకు సౌరవిద్యుత్ యూనిట్లు

- స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆనందరావు



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఆనందరావు

జగిత్యాలరూరల్: మహిళా సంఘ సభ్యులకు సెర్ప్ స్త్రీనిధి ద్వారా సౌర విద్యుత్ యూనిట్లు అందించడం జరుగుతుందని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ ఆనందరావు అన్నారు. గురువారం జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామంలో ఉమ్మడిజిల్లాలోనే మొట్టమొదటిసారి సెర్ప్, స్త్రీనిధి ద్వారా స్వశక్తి సంఘ సభ్యులకు (ఇంటిపైన) సోలార్ ఎనర్జీ ప్లేట్స్ ఐదుగురు సభ్యులకు ఏర్పాటు చేశారు. ఆనందరావు మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఐదుగురు సభ్యులకు సౌరవిద్యుత్ యూనిట్లు అందించడం జరిగిందని అన్నారు. ఇందులో 2 కేవీకి రూ.1,40,200 యూనిట్‌కు ఖర్చు కాగా, అందులో రూ.39,200 సబ్సిడీ ఉంటుందని, మహిళసంఘ సభ్యులకు రూ.లక్ష స్త్రీనిధి లోను అందించడం జరుగుతుందన్నారు. 3కేవీ యూనిట్ ధర రూ.1,92,360 కి గాను రూ.57,360 సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, మిగతా రూ.1.25 లక్షలు స్త్రీనిధి రుణం అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి స్త్రీనిధి రుణాలతో సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. సర్పంచ్ జోగినిపల్లి మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పర్శరాంగౌడ్, సింగిల్ విండో చైర్మన్ జోగినిపల్లి సందీప్‌రావు, ఏపీఎం గంగాధర్, సీసీ సంతోష్, స్త్రీనిధి మేనేజర్ రాణి, వీవోఏలు మీరాబాయి, రమ, వీవో అధ్యక్షురాలు హేమలత, ఆనందరావు, అరుణ, రవీందర్‌రావు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాయికల్: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు, యువకులకు అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా శిక్షకుడు నాగిరెడ్డి రఘుపతి కోరారు. గురువారం రాయికల్ మండలం మైతాపూర్ గ్రామంలో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు టైలరింగ్, యువకులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 99633 47142 నంబరులో సంప్రదించాలని సూచించారు.



అప్పటి జాతరే వేరు!

- శివరాత్రి జాతరపై నాటి పెద్దల ముచ్చట్లు
- ఎడ్లబండ్లపై రాక.. పది రోజుల ప్రయాణం
- మూడు నాలుగు రోజులు ఆ సంబరమే వేరు..



నాటి రాజన్న గుడి

వేములవాడ: మహాశివరాత్రి పండుగకు రెండు రోజుల ముందే ముల్లె..మూట సర్దుకుని ఎడ్ల బండ్లను సిద్ధం చేసుకుని కుటుంబంతో సహా రాజన్న దర్శనానికి బయలుదేరేవాళ్లు. మూడు కమాన్ల వద్ద ఎడ్లబండ్లను నిలిపి.. కాలినడకన వచ్చి గుండంలో స్నానం చేసి.. రాజన్నకు మొక్కులు చెల్లించేవాళ్లు. మళ్లీ ఎడ్లబండ్లవద్దకు చేరుకుని జాగరణ దీపం వెలిగించేవాళ్లు.. నాటి వైభవం.. పేదల దేవుడు.. రైతులపాలిట అన్నదాతగా నాడు.. నేడు కొలువబడుతున్న ఎములాడ రాజన్న సన్నిధిలో నాటి నుంచి నేటి వరకు జరుగుతున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాలపై నాటి తరం జాతర్లపై అప్పటి వారి అనుభవాలతో 'సాక్షి' పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక కథనం..



- ఈ ఫొటోలో కనిపిస్తున్న పెద్దాయన పెద్ది నారాయణ. ఈయనది వేములవాడ. వయస్సు 95ఏళ్లు. చిన్నతనంలో జాతర ఉత్సవాలపై ఇలా చెబుతున్నారు. జాతర గ్రౌండ్‌లో అన్ని పొలాలే ఉండేవి. కచ్రాలపై భక్తులు రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే వారు. మూడు కమాన్లు ఉండేవి. ఈ కమాన్ల వద్ద నుంచి గుడికి నడిచి వెళ్లే వాళ్లు. నయాపైసా, సత్తు పైసా, ఇత్తడి పైసా, నవాబుపైసాలతో రైతులు కొనుక్కునే వారు. నాటి జాతర సంబరమే వేరు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి లైశెట్టి మల్లేశం. వీరిది వేములవాడ. రైతు కుటుంబంలో పుట్టారు. నాడు ఇంతమంది జనం వచ్చేవారు కాదనీ, గంగ అవతలి వాళ్లు వచ్చేవారనీ, ఎండ్లబండ్లపై పది రోజులపాటు ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుని దర్శనాలు ముగించుకుని మళ్లీ ఎండ్లబండ్లపైనే తిరిగి వెళ్లేవారు. అప్పుడు గుండానికి తంతెలు లేవు. చెరువు, గుండం కలిసే ఉండేవి. చెరువు నీళ్లు తియ్యగా ఉండేవి. కచ్రాలపై చేరుకుని చుట్టూ కచ్రాలు నిలిపి మధ్యలో దీపాలు పెట్టుకుని జాగరణ చేసేవాళ్లు. అప్పుడు చారానాకు కొబ్బరికాయ దొరికేది.



- ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి దొర బాలయ్య, చిన్ననాటి నుంచి ఇప్పటి వరకు జాతరలు చూస్తూనే ఉన్నారు. నాటి జాతరలో కట్టకింద నుంచి లక్ష్మీపూర్ వరకు ఎండ్ల బండ్లు నిలిచేవి. రోడ్లు సరిగా లేవు. కాలినడకనే ఎక్కువ. అప్పటి జాతర సంబురం ఇప్పుడు లేదు. జాతరకొస్తే కనీసం మూడు నుంచి నాలుగు రోజులు ఉండే వారు. గాంధీనగర్‌లో గొంగళ్లు తీసుకొచ్చి గొళ్లోళ్లు అమ్ముకునే వారు. వీటిని మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ఇక్కడి నుంచి కొనుక్కుని వెళ్లేవాళ్లు.



నాటి రాజన్న గుడి ముందు భాగం



నాటి ధర్మగుండం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వొజ్జల రాజన్న అర్చకులు. ఇతను 1977 నుంచి మొన్నటి వరకు ఆలయంలో అర్చకుడిగా పని చేశారు. నాటి భక్తి నేడు లేదని చెబుతున్నారు. అప్పుడు భక్తుల రద్దీ తక్కువగా ఉండేది. ఈజీగా దర్శనాలు జరిగేవి. అప్పుడున్న ప్రశాంతత ఇప్పుడు లేదు. అంతా ఆర్టిఫిషియల్‌గా మారింది. గర్భగుడి ముందు ఓ చెక్కను అడ్డంగా పెట్టేవాళ్లు. వీఐపీలు వస్తే చెక్కను జరిపి గర్భగుడిలోకి తీసుకెళ్లి దర్శనాలు చేయించేవాళ్లం. ప్రాతఃకాల పూజ అయ్యే వరకు గుడి తలుపులు తీయకపోయేది. రూ.25కే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించేవాళ్లం. రూ.11కు ఏకవారాభిషేకం, రూ.10 కోడె టికెట్టు. ములుగుకు చెందిన ఆర్యవైశ్యులు ధర్మశాల కట్టించారు. మానుకోట లంబాడాలు ప్రతిఏటా 20 నుంచి 30 కోడెలు తీసుకొచ్చి రాజన్నకు సమర్పించేవాళ్లు.

అప్పుడు తక్కువ మంది వచ్చేవాళ్లం



15 ఏళ్ల నుంచి కల్యాణకట్టకు వెళ్తున్న. చిన్నతనంలో కచ్రాల్లో వచ్చి జాగరణ పూర్తయిన తర్వాతనే తలనీలాలు తీసుకునే వాళ్లు. అప్పుడు మేం కూడా చాలా తక్కువ మంది వచ్చేవాళ్లం. యాత్రికులు కూడ చాలా తక్కువ వచ్చేవారు. గుడారాల్లో, పందిళ్లు, చీరలు అడ్డం కట్టుకుని జాతరా గ్రౌండ్‌లోనే ఉండేవాళ్లు. కత్తెర్లు తీస్తే మాకు చారానా ఇచ్చేవాళ్లు.

– సొగారం భూమయ్య, నాయీబ్రాహ్మణుడు

క్లుప్తంగా

21న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీస్టేడియంలో ఈనెల 21న అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి గురువారం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాస్థాయి జట్టును ఎంపిక చేసేందుకు ఈ సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అదేరోజు ఉదయం 7 గంటలకు స్టేడియంలో హాజరుకావాలని సూచించారు.

శివాలయానికి వెండి నాగఫణి బహూకరణ



నాగఫణి అందిస్తున్న దాత శ్రీనివాస్

రాయికల్: మండలంలోని ధర్మాజీపేట శివాలయంలోని శివలింగానికి కిలో వెండితో తయారుచేసిన నాగఫణిని మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన నాగమల్ల శ్రీనివాస్–ఉమ కుమారుడు శ్రీకర్–శ్వేత దంపతులు గురువారం బహూకరించారు. దీని విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని దాతలు తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వేముల నర్సయ్య, రాజం, అర్చకులు చెరుకు మధుసూదనశర్మ, చెరుకు మహేశ్వరశర్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందిస్తున్న ప్రభాకర్

మల్లాపూర్: యువత సన్మార్గంలో నడవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో నిర్వహించిన అటల్ బిహారీ వాజ్‌పేయి క్రికెట్ టోర్నీ బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేత జట్టు వీవీరావుపేటకు విన్నర్‌కప్‌తో పాటు రూ.15వేలు, మల్లాపూర్ టీంకు రన్నరప్‌కప్ తోపాటు రూ.10వేల నగదు అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు బైన ప్రశాంత్, మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, మండల ఉపాధ్యక్షుడు మోకు రాజేందర్, అభిషేక్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గసభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18న కోదండరాం రాక

బుగ్గారం: బుగ్గారం మండలకేంద్రంలో ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా బుగ్గారం మండలానికి టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వస్తున్నట్లు టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి తెలిపారు. బుగ్గారం మండల కేంద్రంలోని అడవి ప్రాంతంలోని శ్రీ సాంబశివ నాగేశ్వరాయలయంలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరాలయంలో జరిగే ఉత్సవాలకు గురువారం కోదండరాంను ఆహ్వానించినట్లు గంగారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి టీజేఎస్ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడే కంతి మోహన్‌రెడ్డి, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి రామగిరి సంతోష్, జిల్లా పట్టణ అధ్యక్షుడు అల్లెంకి శ్రీనివాస్ హాజరవుతున్నారన్నారు.

దాతల సహకారంతో అల్పాహారం



అల్పాహారం అందిస్తున్న నారాయణ

సారంగాపూర్: దాతల సహకారంతో సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అల్పాహారం అందించడం గొప్ప విషయమని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి నారాయణ అన్నారు. గురువారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రెండు నెలలు పెంబట్లకు చెందిన మర్యాల రాజన్న సాయంత్రం అల్పాహారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మూడేళ్లుగా రాజన్న అల్పాహారం అందిస్తున్నామన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జిల్లా ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కొంక వేణు, సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, జిల్లా పరీక్షల విభాగం సభ్యులు గంగాధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దావన్‌పల్లికి బస్సు నడిపించాలని వినతి

రాయికల్: జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును దావన్‌పల్లి గ్రామానికి నడిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాల డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. గత రెండు సంవత్సరాల నుంచి ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యథావిధిగా పునరుద్ధరణ చేయాలని ఈ సందర్భంగా లేఖలో కోరారు.

ఆద్యంతం.. ఉత్సాహభరితం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుధాకర్ పైప్స్ ప్రతినిధులు



జూనియర్ విభాగంలో ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల-మంచిర్యాల టీమ్‌కు బహుమతి ప్రదానం



సీనియర్ విభాగంలో వాగ్దేవి కళాశాల- మంచిర్యాల జట్టుకు బహుమతి ప్రదానం

- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజనల్ టోర్నమెంట్
- సీనియర్ విజేతగా మంచిర్యాల వాగ్దేవి, రన్నర్‌గా నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విజేతగా మంచిర్యాల ఎస్‌ఆర్‌ఆర్, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నిజామాబాద్‌నాగారం: లక్ష్యాలను ఏర్పరచుకొని క్రీడల్లో కఠోరంగా సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజనల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'సాక్షి' సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. నగర ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో క్రీడలు చాలా అవసరమన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ రాజేశ్, సురేశ్, 'సాక్షి' బ్రాంచ్‌మేనేజర్ పల్లే మహేశ్, బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ సుమన్, క్రికెట్ కోచ్ ఫారస్, గ్రౌండ్‌మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

విజేత జట్లు

- సీనియర్ విభాగంలో విన్నర్‌గా మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, రన్నర్ గా నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విభాగంలో విన్నర్‌గా ఎస్‌ఆర్‌ఆర్ మంచిర్యాల, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఆరు పరుగుల తేడాతో..

సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, నిశిత డిగ్రీ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి వాగ్దేవి కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. సాయి వినయ్ 27, సాయికృష్ణ 19 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిశిత కళాశాల జట్టు 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. 6 పరుగుల తేడాతో మంచిర్యాల వాగ్దేవి కళాశాల జట్టు విన్నర్‌గా నిలిచింది.

అద్భుత ఇన్నింగ్స్‌తో..

జూనియర్ విభాగంలో ఎస్‌ఆర్‌ఆర్ మంచిర్యాల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి ఎస్‌ఆర్‌ఆర్ జట్టు 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. కృష్ణతేజ 24 పరుగులు చేశాడు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 65 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. ఎస్‌ఆర్‌ఆర్ మంచిర్యాల జట్టులో సంతోష్ హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 4 వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

జట్టు విజయానికి హ్యాట్రిక్ ఉపయోగపడింది



ప్రత్యర్థి జట్టు నడ్డివిరవడానికి నేను తీసుకున్న నాలుగు వికెట్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. హ్యాట్రిక్ తీయడం సంతోషంగా ఉంది. గతంలో కూడా టోర్నమెంట్‌లలో హ్యాట్రిక్ తీశాను. రీజనల్ స్థాయి పోటీల్లో నా బౌలింగ్ బాగా రావడానికి చాలా రోజుల నుంచి శ్రమించా. శ్రమకు తగిన ఫలితం లభించింది.

– సంతోష్, ఎస్‌ఆర్‌ఆర్ మంచిర్యాల కళాశాల

క్రీడాకారులను ప్రోత్సహించడానికే..



క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'సాక్షి' నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్ చేశాము. 'సాక్షి' ముందుండి వివిధ రకాల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. మా సంస్థ 'సాక్షి' క్రీడాకారులను ప్రోత్సహించే టోర్నమెంట్‌లకు సపోర్టుగా ఉంటుంది.

– రాజేష్, సుధాకర్‌పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్

'సాక్షి'కి ప్రత్యేక అభినందనలు



'సాక్షి' సంస్థ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌తో పాటు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. 'సాక్షి' చేస్తున్న కృషికి మా సంస్థ తరఫున చిరుసాయం చేస్తున్నాం. ఇందుకు 'సాక్షి'కి ప్రత్యేకంగా అభినందనలు.

– సురేష్, సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటివ్

బాలికల అస్వస్థతపై విచారణ

- నివేదిక కోరిన విద్యాశాఖ డైరెక్టర్
- సిబ్బందిపై వేటు?

జగిత్యాల: కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా, బుధవారం డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఇందులో విద్యార్థులకు సక్రమంగా భోజనం పెట్టడం లేదని, 2–3 రోజులకు చెందిన సాంబారు, ఇడ్లీలు పెట్టారని, దీంతో వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వచ్చిందని పేర్కొన్నట్లు తెలిసింది. విద్యాశాఖ డైరెక్టర్ దీనిపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా, బయటి భోజనం ఎలా వచ్చింది. ఎందుకు తెచ్చారు. ఎవరు ఇచ్చారు. అది తింటేనే అస్వస్థతకు గురయ్యారా అన్న కోణంలో విచారించారు. ఒకవేళ సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే పూర్తిస్థాయిలో విద్యాశాఖ డైరెక్టర్ నుంచి వేటుపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

నివేదిక పంపిస్తాం

విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయంపై నివేదిక పంపిస్తాం. పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నాం. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. దీనిపై పూర్తిస్థాయి నివేదిక పంపిస్తాం.

– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- నేడు స్వామివారి కల్యాణం



అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామోజుల చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం రాత్రి దుబ్బరాజేశ్వరస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు స్వామివారి కల్యాణం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, ఎంపీపీ కోల జమున, సర్పంచులు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల జమున, వింటోచైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తోడేటి శేఖర్‌గౌడ్, రెన్నోవేషన్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాకేంద్రంలోని తీన్‌ఖని ప్రాంతానికి చెందిన (25) యువతి అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తీన్‌ఖని ప్రాంతానికి చెందిన యువతి గురువారం ఉదయం 4 గంటల సమయంలో ఇంట్లోంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి మేనమామ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్కు రద్దు చేయాలి

- మెట్లచిట్టాపూర్ గ్రామస్తుల రాస్తారోకో
- సంఘీభావం తెలిపిన పలు పార్టీలు



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు

మెట్‌పల్లి: మండలంలోని మెట్లచిట్టాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గురువారం మెట్‌పల్లి పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఇందులో బీజేపీ, కాంగ్రెస్, తెలంగాణ జనసమితి నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ముందుగా వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ర్యాలీగా పాత బస్టాండ్ చేరుకొని అక్కడ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో పేదలకు కేటాయించిన ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం చేయడం తగదని అన్నారు. ముఖ్యంగా ఇథనాల్ పరిశ్రమకు అనుమతులిచ్చిందని, దీనివల్ల కాలుష్యం వెలువడి ఎన్నో విధాలుగా గ్రామస్తులకు నష్టం జరుగుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటును గ్రామస్తులంతా వ్యతిరేకిస్తున్నారని, ప్రభుత్వం దీనిని గమనించి వెంటనే అనుమతులను రద్దు చేయాలన్నారు. అలాగే పేదలకు ఇచ్చిన భూములు వారికే చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ర్యాలీగా రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆల్‌ఇండియా క్రీడాపోటీలకు కొడిమ్యాల కానిస్టేబుళ్లు



తూడి మల్లేశం



కోడూరి సాజన్‌గౌడ్

కొడిమ్యాల: మార్చి 21 నుంచి 25వ వరకు ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో నిర్వహించే 71వ ఆల్ ఇండియా ఖోఖో పోటీలు కొడిమ్యాల మండలకేంద్రానికి చెందిన కానిస్టేబుళ్లు తూడి మల్లేశం, కోడూరి సాజన్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ ఖోఖో స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో మల్లేశం, సాజన్ ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ఖోఖో స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరిరువురు తెలంగాణ జట్టు తరఫున ఆల్‌ఇండియా స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రస్తుతం మల్లేశం జగిత్యాల స్పెషల్ పార్టీలో, సాజన్ టీఎస్‌ఎస్‌పీ సిరిసిల్ల 17వ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లను పలువురు పోలీసు ఉన్నతాధికారులు, నాయకులు అభినందించారు.

సంతానం కలగడం లేదని వ్యక్తి ఆత్మహత్య

- భర్త మృతి తట్టుకోలేక భార్య ఆత్మహత్యాయత్నం



రాములు (ఫైల్)

పెగడపల్లి: మండలంలోని సుద్దపల్లికి చెందిన నలువాల రాములు (31) సంతానం కలగడం లేదని గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా భర్త మృతి తట్టుకోలేక భార్య మమత కూడా ఆత్మహత్యకు యత్నించింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాములుకు ధర్మారం మండలం బంజేరుపల్లికి చెందిన మమతతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేకపోవడంతో ఈ విషయమై భార్య భర్తల మధ్య తరుచుగా గొడవలు వస్తున్నాయి. ఈ క్రమంలో రాములు జీవితంపై విరక్తిచెంది బుధవారం ఇంట్లో నుంచి వెళ్లాడు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించడంతో గురువారం గ్రామశివారులో శవమై కనిపించాడు. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన రాములు మృతదేహాన్ని చూసి భార్య మమత కూడా మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది, వెంటనే కుటుంబ సభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్సఅందిస్తున్నారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు.

అనారోగ్యంతో ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

మల్యాల: మండలకేంద్రానికి చెందిన కాల్వల లచ్చయ్య ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. మల్యాల మండలకేంద్రానికి చెందిన లచ్చయ్య సింగరేణిలో పంప్‌ఆపరేట్‌గా పనిచేసి, రిటైరయ్యాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఒంటరిగా ఉండడంతో మద్యంకు బానిసై పక్షవాతం బారినపడి మూడు నెలలు కుమారుడు సత్యనారాయణ వద్దే ఉన్నాడు. పది రోజుల క్రితం మల్యాలలోని తన ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది నాలుగు రోజుల క్రితం తన ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం లచ్చయ్యకు తన కుమారుడు సత్యనారాయణ ఫోన్‌చేయగా స్పందించకపోవడంతో ఇంటికి వెళ్లి చూడగా, ఇంట్లో నైలాన్ తాడుతో ఉరేసుకుని కనిపించాడు. మృతుడి కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెస్‌తో మేధస్సుకు పదును

- అదనపు కలెక్టర్ మంద మకరంద్



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాలటౌన్: చెస్ మేధస్సుకు పదును పెడుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మంద మకరంద్ అన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మహిళా చెస్ పోటీలను గురువారం జగిత్యాల మినీస్టేడియంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బోనగిరి నరేశ్, పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీఈటీలు కృష్ణప్రసాద్, అంజయ్య, జమున, వెంకటలక్ష్మి క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా 'రైతు డిక్లరేషన్'

- రైతును రాజు చేయడమే కాంగ్రెస్ లక్ష్యం
- షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి రూ.4వేల మద్దతు ధర అందిస్తాం
- పసుపుబోర్డు ఏర్పాటుచేసి ప్రధాన పంటలకు మద్దతు ధర కల్పిస్తాం
- తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే



రైతుల సమస్యలు వివరిస్తున్న సత్యంరెడ్డి

మల్లాపూర్: అన్నదాతకు అండగా నిలిచేందుకే కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం ఏఐసీసీ కిసాన్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డి నేతృత్వంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి పాల్గొని నిజాం షుగర్ ఫ్యాక్టరీల మూసివేత, పసుపు బోర్డు ఏర్పాటు, చెరుకు, పసుపు రైతుల సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా కిసాన్‌కాంగ్రెస్ నాయకులు, రైతులతో మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడారు. రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రైతు డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలను రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. చెరుకు రైతుల సంక్షేమానికి నిజాం షుగర్ ఫ్యాక్టరీలు తెరిపించి చెరుకుకి రూ.4వేల మద్దతు ధర అందిస్తామన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుచేసి రూ.15వేల గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. రైతు హక్కుల పరిరక్షణకు 'రైతు కమిషన్' ఏర్పాటుచేస్తామని, నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతా అంశంగా తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జగన్‌లాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు శశిందర్‌రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని గ్రామ కమిటీలు చెల్లవు

- కాంగ్రెస్ శ్రేణులను తప్పుదోవ పట్టిస్తే సహించం
- పీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ



మాట్లాడుతున్న నారాయణ

మల్లాపూర్: పీసీసీ నిబంధలను విరుద్ధంగా వేసిన కాంగ్రెస్ గ్రామకమిటీలు చెల్లవని పీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రుత్త నారాయణ అన్నారు. గురువారం మల్లాపూర్ మండలకేంద్రంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీపీసీసీకి కొత్త కమిటీ ప్రకటిచడంతోనే డీసీసీ, బ్లాక్, మండల కమిటీలు రద్దయినట్లు టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ అధికారికంగా తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటి వరకు కేవలం టీ పీసీసీ కార్యవర్గంతో పాటు నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున పీసీసీ డెలిగేట్ సభ్యులు, జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించారన్నారు. ఈ నెలాఖరులోగా ప్రతి నియోజకవర్గానికి కమిటీలు వేసేందుకు టీ పీసీసీ ప్రధాన కార్యదర్శులను నియమించనున్నారని, వారి సమక్షంలోనే బ్లాక్, మండల నూతన కమిటీలు ఎన్నుకుని ప్రకటించనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ కోవర్టులైన కొందరు అధిష్టానాన్ని ధిక్కరించి పీసీసీ నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ పేరుతో గ్రామ కమిటీలు ప్రకటిస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు గందరగోళానికి గురికావొద్దని, ఆ కమిటీలు చెల్లవన్నారు. ఈ విషయమై టీ పీసీసీకి ఫిర్యాదు చేశామని, మరోసారి పునరావృతమైతే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, మామిడి రాజశేఖర్, ఇప్పపెల్లి గణేశ్, మొగిలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాల: ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ యాస్మిన్ భాషా అన్నారు. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు నిర్వహించే ఆర్బీఐ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత పైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కి ఎవరూ స్పందించవద్దని, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల శాఖల ద్వారా ప్రతి నెలా ఖచ్చితంగా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధుసూదన్, యూబీఐ మేనేజర్లు శ్రీనివాసరావు, ముఖేశ్ పాల్గొన్నారు.